క్లుప్తంగా

గురుకులంలో ముందస్తు దీపావళి వేడుకలు


దీపావళి వేడుకల్లో బాణసంచా కాల్చుతున్న గురుకుల విద్యార్థినులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం శ్రీసత్య సాయి గురుకులంలో బుధవారం దీపావళి ముందస్తు వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకులం ప్రిన్సిపాల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ చెడుపై విజయం దీపావళి విశిష్టత అని అన్నారు. పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దీపావళి పండగను పర్యావరణహితంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు లక్ష్మీపూజ నిర్వహించారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు బాణాసంచా కల్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కడియం: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మురమండ గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రజకులపేట రామాలయం వద్ద జరిగిన ఈ శిబిరం డాక్టర్ ఎస్.జెస్సీసుప్రియ ఆధ్వర్యంలో 67 మందిని పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి సేవలు అభినందనీయం


వృద్ధులకు ఆహారాన్ని అందజేస్తున్న బెన్నిబాబు

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని జియోన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ ఎంజేఎస్ రాజ్ బెన్నిబాబు పేర్కొన్నారు. స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఐదో వార్షికోత్సవాన్ని ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్ దంపతుల ఆధ్వర్యంలో బుధవారం ధవళేశ్వరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంజేఎస్ రాజ్ బెన్నిబాబు విచ్చేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు ఆహారం, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా బెన్నిబాబు మాట్లాడుతూ స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోసికుమార్, సత్య దంపతులు సేవలు అభినందనీయమని, వారి ఆధ్వర్యంలో జరుగుతున్న నిత్యాన్నదానం ఎంతో మంది పేదలకు ఆకలి తీరుస్తుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూరంపూడి మాణిక్యాలరావు, ప్రేమ టీచర్, మూర్తి సార్, సుబ్బారావు, జీ జైకుమార్, జి.నాగార్జున, జి.జయప్రద, జి.శ్రావ్య, ట్రస్ట్ సభ్యులు కేవీఆర్ సాగర్, బి.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు త్వరగా పనులు పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ద్వారా వివిధ అభివృద్ధి పనులు పొందిన కాంట్రాక్టర్లు నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా అగ్రిమెంటులోని కాల వ్యవధి ప్రకారం పనులు పూర్తి చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగు అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు వద్ద తగినంత మందిని వినియోగించడం లేదని అందువల్ల పనులు ఆశించినంత వేగంతో జరగడం లేదన్నారు. ఇసుక ఎంత కావాలో ముందుగా ఇండెంట్ తయారు చేస్తే జిల్లా అధికారులను సంప్రదించి ఇసుకను సప్లై చేస్తామన్నారు. ఇంజినీర్లు ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం ముగిసినందున కాంట్రాక్టర్లు పనులను వెంటనే ప్రారంభించి, నిర్దేశించిన కాలవ్యవధిలో పూర్తి చేయాలన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు పనులను నిరంతరం తనిఖీ చేస్తుండాలని ఆదేశాలు జారీ చేశాబూరు. ఈ సమావేశంలోఇన్‌చార్జి ఎస్ఈ పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు షేక్ మదర్షా ఆలీ, పి.రీటా, ఎంవీకే మాధవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.సత్యనారాయణ, విరూపాక్షరావు, లోవరాజు, వెంకటలక్ష్మి, అసిస్టెంటు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం సోమాలమ్మగుడి ప్రాంతంలో బుధవారం సారా విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. పుచ్చకాయల దుర్గాప్రసాద్, గొట్టేటి మహేష్, చల్లా నవీన్, వెంగళరాజేష్‌లను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టపాసులతో భద్రం సుమా..!

- కాల్చే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- దీపావళిని ఆనందంగా జరుపుకోండి
- వైద్యనిపుణుల సూచన



నగరంలో ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

రాజమహేంద్రవరం రూరల్/సీటీఆర్ఐ: చెడుపై మంచి విజయం సాధించిన గుర్తుగా భారతదేశం అంతటా దీపావళి పండగను జరుపుకొంటారు. దీపావళి పండగ అనగానే అందరికీ గుర్తుకు వచ్చేవి టపాసులే.. చిన్నవారు మొదలు పెద్ద వారి వరకు అందరూ ఇష్టంగా.. కుటుంబ సమేతంగా టపాసులు కాల్చుతూ ఆనందాలను పంచుకుంటారు. రాత్రి వేళల్లో విద్యుత్ లేకపోయినా పండగకు కాల్చే చిచ్చుబుడ్లు, కాకర పువ్వొత్తులు, మతాబులు, తారాజువ్వల వెలుగులతో నగరమంతా మిరుమిట్లు గొలిపే వెలుగు జిలుగులతో మెరిసిపోతుంది. వివిధ వలయాల ఆకారంలో ఆకాశంలో తారాజువ్వలు కాంతిని వెదజల్లుతూ ఉంటే ఆ దృశ్యం కనులకు ఎంతో రమణీయంగా ఉంటుంది. ఎంతో ఆనంద సంతోషాల మధ్య జరుపుకొనే పండగ వేళలో ఏదైనా పొరపాటున ప్రమాదం జరిగితే అనగా మందుగుండు సామగ్రి చేతిలో పేలటం లాంటి చెడు సంఘటనలు జరిగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

జాగ్రత్తలు పాటించండి

టపాసులు కాల్చే సమయంలో ముఖ్యంగా పేలుళ్లు ఎక్కువగా ఉండే మందుగుండు సామగ్రి కాల్చేటప్పుడు సాధ్యమైనంత దూరంగా ఉండి వాటిని వెలిగించాలి. లేని పక్షంలో చెవికి సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. శబ్దం తక్కువగా ఉండే మందులను కాల్చడం ద్వారా ధ్వని కాలుష్యం కొద్ది మేరకు తగ్గే అవకాశం ఉంది. సాధ్యమైనంత మేరకు దూరంగానే ఉండి మందులకు నిప్పు అంటించాలి. ఇనుప కడ్డీలతో కూడిన మందులను కాల్చినప్పుడు జాగ్రత్తగా ఇనుప చువ్వలను కాళ్లలో గుచ్చుకోకుండా భద్రం చేయాలి. లేని పక్షంలో అవి గుచ్చుకునే ప్రమాదం ఉంది. కాల్చిన వెంటనే వాటిని నీటిలో వేయాలి.

ఆర్ట్స్ కళాశాల మైదానంలో దుకాణాలు

దీపావళి సందర్భంగా గతంలో పలు ప్రాంతాల్లో సంభవించిన అగ్నిప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు, జనావాసాల మధ్య, రోడ్ల పక్కన, ఎక్కడ పడితే అక్కడ బాణసంచా విక్రయాలు సాగించకుండా అన్ని జాగ్రత్తలు నడమ రాజమహేంద్రవరం నగరంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో బాణ సంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. ఆర్ట్స్ కళాశాలలోనే కాకుండా మున్సిపల్ స్టేడియం, బాణసంచా విక్రయించడానికి అనుమతులు మంజూరు చేశారు.

వెలవెలబోతున్న షాపులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటాయి. అధిక ధరలతో సామాన్యుడు సతమతమవుతున్నాడు. మధ్య తరగతి కుటుంబాలు దీపావళి సామానులు కొనాలంటే ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజులు నుంచి ఆర్ట్స్ కళాశాలలో షాపులు వేసుకుని కొనే వారి కోసం వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. ఆఖరి రెండు రోజులు విక్రయాలు ఎక్కువగా ఉంటాయని ఆశతో ఎదురు చూసే యాజమానులకు బుధవారం వరుణుడు షాక్ ఇచ్చాడు. మధ్యాహ్నం ఆకస్మాత్తుగా వర్షం కురువడంతో షాపు యాజమానులు కుదేలైయ్యారు. గురువారం దీపావళి కావడంతో ఎం చేయాల్లో తెలియని పరిస్థితిలో ఉన్నారు. కనీసం తీసుకొచ్చిన సామాన్లలో 15 శాతం అయిన అమ్మకాలు జరగవని యాజమానులు అంటున్నారు.

మార్కండేయ స్వామికి లక్ష బిల్వార్చన

స్థానిక గోదావరి గట్టు వద్ద మార్కండేయస్వామి ఆలయంలో స్వామి వారికి మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ కుటుంబ సభ్యులు లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. గోదావరి నదిలో గంగపూజ, శివాలయంలో అభిషేకం, లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. పెద్దింటి నీలకంఠ సారధ్యంలో జరిగిన ఈ క్రతువులో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. పండిత సత్కారాలు జరిగాయి. ఈసందర్భంగా మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ ఏటా దీపావళి ముందురోజు ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని, అందులో భాగంగా ఇప్పుడు కూడా లక్ష బిల్వార్చన చేస్తున్నామని తెలిపారు.


టపాసులు కాలుస్తున్న దృశ్యం(ఫైల్)


ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ భరత్

నిప్పురవ్వలతో కళ్లు జాగ్రత్త



కళ్లల్లో నిప్పురవ్వలు పడకుండా జాగ్రత్త పడాలి. కళ్లజోడు పెట్టుకోవడం చాలా మంచిది. ఏదైన పొరపాటున కంట్లో రవ్వలు పడితే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. కంటిలో ఏదైన పడితే సొంత వైద్యం చేయడం చాలా ప్రమాదకరం. ముఖ్యమంగా కంటిలో నీటిని చల్లడం, నాలుకపెట్టి కంటిలో ఉన్న వాటిని తొలగించడం వంటివి చేయడం చాలా అనర్థాలకు దారి తీస్తోంది.

–డా.రహీమున్నీసా,
కంటివైద్య నిపుణులు, జిల్లా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రాజమహేంద్రవరం

చర్మం కాలకుండా..



టపాసులు కాల్చే సమయంలో కాటన్ వస్త్రాలు, లూజుగా ఉండే వస్త్రాలు ధరించడం చాలా ఉత్తమం. టపాసులు కాల్చే సమయంలో చెప్పులు వేసుకోవాలి. మహిళలు జుట్టును లూజుగా వదలకూడదు. టపాసులు కాల్చేటప్పుడు పక్కన చల్లని నీటిని పెట్టుకోవాలి. నిప్పురవ్వలు పడిన వెంటనే చల్లని నీటితో ఆ ప్రాంతంలో శుభ్రంగా కడగాలి. కాలిన గాయానికి గాలి ఆడేటట్లు చూడాలి. చర్మానికి ఏదైన కాలడం ద్వారా గాయం ఏర్పడితే అశ్రద్ధ చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

–డా.సీహెచ్‌వీ సునీతదేవి,
చర్మవ్యాధుల నిపుణులు, జిల్లా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, రాజమహేంద్రవరం

విద్యతో పాటు ఉపాధి

- 170 మంది విద్యార్థినులకు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు
- అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి


ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రాఘవకుమారి తదితరులు

సీటీఆర్ఐ: అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎస్ఆర్‌కే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి అన్నారు. బుధవారం స్థానిక కళాశాలలో విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా వివిధ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన 50 మంది, ఎస్ఆర్‌కే ప్రభుత్వ మహిళా కళాశాలకి చెందిన 150 మంది ఇంటర్వ్యూలో అర్హత సాధించారు. ఈ సందర్భంగా రాఘవకుమారి మాట్లాడుతూ విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగం వంటివి సాధించడానికి ఈ జాబ్ మేళాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అన్ని గ్రూపులకు చెందిన విద్యార్థినులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఎంపికైన వారందరికీ హైదరాబాద్‌లో స్టైపండ్‌తో పాటు జాబ్‌లో మెళకువలు నేర్పుతారన్నారు. ఈ కార్యక్రమంలో కేరీర్ కౌన్సిలింగ్ సభ్యులు కె.నీరజ, సీవీ ప్రసాద్, వి.సూరిబాబు, మౌనిక, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు


వారోత్సవాలలో మాట్లాడుతున్న ఏసీబీ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు

రాజమహేంద్రవరం రూరల్: సమాజంలో ప్రతి పౌరుడు అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని రాజమహేంద్రవరం రేంజ్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు ఎస్వీ భాస్కరరావు, డి.వాసుకృష్ణ, వై.సతీష్ పేర్కొన్నారు. హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు భాస్కరరావు, వాసుకృష్ణ, సతీష్ మాట్లాడుతూ ఆర్థిక, రాజకీయ, సాంఘిక అభివృద్ధికి అవినీతి పెద్ద అవరోధంగా మారిందన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులపై ఒక ప్రత్యేక చట్టం ఉందన్నారు. ఉద్యోగులు లంచం తీసుకుని పట్టుబడితే శిక్ష కఠినతరంగా ఉంటుందన్నారు. కేసు నిరూపణ అయితే ఉద్యోగంను కోల్పోవడంతో పాటు, ఇతర బెనిఫిట్లు కోల్పోతారన్నారు. అనంతరం ఎంపీడీవో డి.శ్రీనివాసరావు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్అండ్ఆర్డీ సునిల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కక్షతో విద్యుత్ సరఫరా నిలిపివేత


విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో షెడ్డు వద్దే కూర్చున్న హరికృష్ణ

కడియం: కడియపుసావరం సర్పంచ్ చెక్కపల్లి మురళి అక్రమాలను తమ కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారన్న కక్షతో తన వెల్డింగ్ షెడ్డు విద్యుత్ సరఫరాను కట్ చేయించి, తన ఉపాధిని దెబ్బతీశారని అదే గ్రామానికి చెందిన జ్యోతుల హరికృష్ణ వాపోయారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాను ఒకరి నుంచి స్థలం, అందులోని విద్యుత్ కనెక్షన్‌తో సహా కొనుక్కును వెల్డింగ్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నానన్నారు. విద్యుత్ బకాయిలు లేకుండా బిల్లులు కూడా చెల్లించానన్నారు. అయితే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా బుధవారం తన షెడ్డు విద్యుత్ కనెక్షన్‌ను తొలగించారని హరికృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివార్లలో కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటున్న వారి నుంచి అక్కడ డ్రైన్లు వేస్తానని ఒక్కో ఇంటి నుంచి రూ.30వేలు చొప్పున వసూలు చేశారన్నారు. అయితే అక్కడ ఎటువంటి డ్రైన్లు నిర్మించకపోగా ఒక గుంత తీసి సరిపెట్టేశారన్నారు. డ్రైన్లు ఎందుకు నిర్మించలేదని 3వ వార్డు సభ్యురాలైన తన వదిన ప్రశ్నించారని, దీంతో తన కుటుంబంపై సర్పంచ్ కక్షగట్టి విద్యుత్ సరఫరాను నిలిపివేశారని హరికృష్ణ తెలిపారు. తన కుటుంబానికి ప్రధాన ఆధారమైన వెల్డింగ్ షెడ్డు విద్యుత్ కనెక్షన్ తక్షణం పునరుద్ధరించాలని, లేకుంటే కుటుంబంతో సహా ఆమరణదీక్ష చేస్తానని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు హరికృష్ణ వివరించారు.

108లో శిశివు జననం


108లో శిశివుతో ఈఎంటీ సుహాసిని, పైలట్ త్రిమూర్తులు

రాజమహేంద్రవరం రూరల్: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువడంతో 108లోనే డెలివరీ అయిన సంఘటన బుధవారం శాటిలైట్‌సిటి గ్రామంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఉన్నాయి. శాటిలైట్‌సిటి ఏ బ్లాక్‌కు చెందిన కప్పిరి సుబ్బులు అనే గర్భిణికి పురిటినొప్పులు రావడంతో 108కు కాల్ చేశారు. హుటాహుటిన అక్కడకు వచ్చిన రాజమహేంద్రవరం–2 108లో ధవళేశ్వరం పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో పైలట్ త్రిమూర్తులు 108ను పక్కకు పెట్టగా ఈఎంటీ సుహాసిని ఆశాకార్యకర్త కుమారి సహకారంతో డెలివరీ చేయగా సుబ్బులు ఆడపిల్లకి జన్మించింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని చికిత్స నిమిత్తం ధవళేశ్వరం పీహెచ్‌సీలో తీసుకెళ్లినట్టు పైలట్ త్రిమూర్తులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు ఇప్పటివరకు తిరిగిరాలేదని పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామానికి చెందిన షేక్ హబీబాబేగం బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌హబీబాబేగం కుమారుడు 30 ఏళ్ల షేక్ అన్వర్ భార్యతో కలిసి హుకుంపేట డీ బ్లాకులో నివాసం ఉంటున్నాడు. ఈనెల 11వ తేదీన అన్వర్ అతని బావమరిది షేక్‌జాఫర్‌తో గొడవ పడ్డాడు. ఆరోజు జాఫర్ హబీబాబేగంకు ఫోన్ చేసి అన్వర్ తాగి వచ్చి తనను కొట్టాడని ఒకసారి వచ్చి మాట్లాడాలని తెలిపాడు. 12వ తేదీ హబీబాబేగం హుకుంపేట డీ బ్లాకుకు వచ్చేసరికి అన్వర్ భోజనానికి రాలేదు. అప్పటి నుంచి ఇంటికే రాలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొంది. ఈ మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై సీహెచ్‌వీ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుష్కరాలు పారదర్శంగా జరగాలంటే

కార్పొరేషన్ ఎన్నికలు తప్పనిసరి

డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి పుష్కరాలు–2027 పారదర్శకంగా జరగాలంటే రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఎన్నికలు నిర్వహిస్తే సజావుగా జరుగుతాయని ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టి.కె.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పుష్కరాలకు రూ.500 కోట్లు వస్తాయని అంచనాలు ఉన్నాయని, ఇలాంటి సమయంలో కౌన్సిల్ ఏర్పడితే కార్పొరేటర్లు బాధ్యత తీసుకుని అభివృద్ధిలో భాగస్వాములవుతారన్నారు. కౌన్సిల్ కాలపరిమితి ఎప్పుడో పూర్తయిందని, గ్రామాల విలీనం అంశం కారణంగా కోర్టులో వివాదం నలుగుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని నచ్చజెబితే పిటీషన్లు విత్ డ్రా అవుతాయని, అప్పుడు ఎన్నికలు జరిపించడానికి వీలవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కోట్లాది మంది యాత్రికులు పుష్కరాలకు వచ్చే అవకాశం ఉన్నందున, కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోడానికి నగరపాలక మండలి అవసరం ఎంతైనా ఉంటుందన్నారు. గోదావరిలో చెత్త క్లీనింగ్ కోసం మిషన్ సత్వరం రప్పించాలని కోరారు. సెంటర్ డివైడర్లు ఎక్కడ పడితే అక్కడ కట్టేసినా, రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు చేయకపోవడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అయిపోతోందన్నారు. తక్షణం ఈ అంశంపై దృష్టి పెట్టాలన్నారు. రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం భవన నిర్మాణం పూర్తి చేసి, పురావస్తు సంపద అందరూ తిలకించేలా చర్యలు చేపట్టాలని, అలాగే శ్రీ వీరేశలింగ పురమందిరం కూడా ప్రారంభించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మార్టిన్ లూథర్, పట్నాల శ్రీనివాస్, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మోతా శారద, ఎస్సీ నాయకులు జాల నటరాజ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

కార్తిక పుణ్య స్నానాలకు గోదావరి ఘాట్లు సిద్ధం


ఘాట్‌లలో శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు


ఘాట్‌లలో ఏర్పాటు చేసిన దుస్తులు మార్చుకునే గదులు

రాజమహేంద్రవరం సిటీ: దీపావళి అనంతరం కార్తిక మాసం ప్రారంభం కానుండడంతో గోదావరి పుణ్య స్నానాలు ఆచరించే భక్తుల కోసం గోదావరి ఘాట్లను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శుభ్రం చేసే కార్యక్రమాలను ప్రారంభించారు. నగరంలో 11 గోదావరి ఘాట్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. కోటిలింగాల ఘాట్, చింతాలమ్మ ఘాట్, కనకదుర్గ ఘాట్, న్యూ పుష్కర ఘాట్, పుష్కర ఘాట్ మార్కండేయ ఘాట్, విశ్వేశ్వర ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమీ ఘాట్ లను సిద్ధం చేశారు. గోదావరి ఘాట్లలో పేరుకుపోయిన వ్యర్థాలను సుమారు 96 మంది ప్రత్యేక పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ సానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్ తెలిపారు గోదావరి నదిలో కార్తిక పుణ్యస్నానాలతోపాటు భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు కోటిలింగాల ఘాట్, చింతాలమ్మ ఘాట్, గౌతమీఘాట్, మార్కండేయ ఘాట్లలో షవర్ బాత్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అదే విధంగా పుష్కర ఘాట్‌లోని జల్లు శివలింగం స్నాన ఘట్టం ఉదయం, సాయంత్రం పని చేసేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలతో భక్తుల పుణ్యస్నానాలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్టు శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా ఘాట్‌లలో స్నానాలు ఆచరించిన మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు అవసరమైనా ప్రత్యేక గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.